క్లుప్తంగా

గిరిజన సమస్యలపై నిరసన నేడు

దేవరాపల్లి : మండలంలోని గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న, మండల కార్యదర్శి బీటీ దొర తెలిపారు. జీడి పిక్కలు కేజీకి రూ. 200 మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే కనుగోలు చేయాలని, గిరిజనుల సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని, గతంలో పట్టాలు వచ్చిన వారందరికీ ఆన్‌లైన్ చేయాలన్న డిమాండ్లతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమావేశం నిర్వహించి, నిరసన చేపడతామన్నారు.

జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో బహుమతి



విద్యార్థి నరేష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ, అధ్యాపకులు

నర్సీపట్నం : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి సరమండ నరేష్ జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో తృతీయ బహుమతి సాధించాడు. ఈ నెల 22న చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్రంపై నిర్వహించిన పోటీల్లో నరేష్ మంచి ప్రతిభ కనబరిచి తృతీయస్థానం సాధించాడు. ఆ విద్యార్థిని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు, వైస్‌ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణ, అర్థశాస్త్ర అధ్యాపకుడు డా. నారాయణరావు, పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు చక్రవర్తి అభినందించారు.

350 కలశాలతో భక్తుల ఊరేగింపు



గ్రామంలో కలశాలతో ఊరేగుతున్న భక్తులు

నాతవరం : శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించారు. వీటీ అగ్రహారంలో 750 ఏళ్ల క్రితం ప్రతిష్ఠించిన శివలింగానికి వేదపండితులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 15వ తేదీ నుంచి 26వ తేదీ వరకు విశ్వశాంతి యోగం చండీ మహామృత్యుంజయ శ్రీరుద్ర యోగం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సోమవారం శివాలయంలో 350 మంది భక్తులు కలశాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

తాటాకిల్లు దగ్ధం

మాకవరపాలెం : మండలంలోని యరకన్నపాలెంలో ఒక తాటాకిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఉలంపర్తి అచ్చియ్యమ్మకు చెందిన ఇల్లు సోమవారం తెల్లవారుజామున దగ్ధమైంది. విద్యుత్ సార్ట్ షర్క్యూట్ కారణంగా దగ్ధమైందని స్థానికులు చెబుతున్నారు. అయితే అచ్చియ్యమ్మ ఉపాధి నిమిత్తం వేరొకగ్రామంలో ఉండడంతో ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఇంటిలో ఉన్న వస్తువులు, దుస్తులు, ఇతర సామాగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఇంటిని ఇన్‌చార్జి తహసీల్దార్ రామారావు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

నేటి నుంచి గరగలు ఉత్సవం

నాతవరం : నూకాలమ్మ తల్లి పండగ సందర్భంగా మంగళవారం నుంచి గరగలు ఉత్సవం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుంది. పండగ సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మంగళవారం గరగలు సంబరం ప్రారంభించి అయిదు రోజులు పాటు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి సంతాపం



రోలుగుంట : కుసుర్లపూడి గ్రామానికి చెందిన పబ్బవరపు పెద్దినాయుడు(68) గుండెపోటుతో సోమవారం రాత్రి తన నివాసంలో మృతి చెందాడు. ఆయన వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. పాలకేంద్రం అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. పెద్దినాయుడు మృతి గ్రామంలో పార్టీకి తీరని లోటని పలువురు సంతాపం ప్రకటించారు. ఇతని కుమారుడు కాశి ఉప సర్పంచ్‌గా ఉన్నారు.

కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు 28న ఇంటర్వ్యూలు

మాడుగుల రూరల్ : మండలంలో బీసీ, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈ నెల 28న స్థానిక ఎంపీపీ కార్యాలయం వద్ద ఇంటర్వ్యూలకు హాజరుకావాలని స్థానిక ఎంపీడీవో కె.అప్పారావు సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. వెనుకబడిన తరగతుల వారికి 45 యూనిట్లు, ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు 2, బ్రాహ్మణులకు 2, కమ్మ 1, రెడ్డి 2, వైశ్య 1, క్షత్రియ 2, కార్పొరేషన్లు ద్వారా సబ్సిడీ రుణాలు అందించడం కోసం ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

ఎండుతున్న చెరకు.. మండుతున్న రైతు



లారీలు రాకపోవడంతో ట్రాక్టర్ల ద్వారా చెరకు తరలింపు

గోవాడ సుగర్స్ యాజమాన్యం నిర్లక్ష్యం

ఐదు రోజులుగా లారీల ద్వారా నిలిచిన చెరకు రవాణా

కాటాల వద్ద 15 రోజుల నుంచి ఎండుతున్న చెరకు

రెండు మాసాలుగా కలాసీలకు అందని వేతనాలు



కె.జె.పురం చెరకు కాటా వద్ద రైతుల ఆవేదన



కె.జె.పురం చెరకు కాటా వద్ద ఎండుతున్న చెరకు

మాడుగుల రూరల్ : గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో గల చెరకు కాటాల నుంచి ఫ్యాక్టరీకి తరలింపులో ఏర్పడిన జాప్యం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలో కె.జె.పురం, ఘాట్‌రోడ్డు జంక్షన్, ఒమ్మలి చెరకు కాటాల నుంచి గతంలో సుమారు 74 వేల టన్నుల చెరకును గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి లారీల ద్వారా తరలించేవారు. అయితే నేడు ఈ మూడు కాటాల ద్వారా సుమారు 9 వేల టన్నుల చెరకు సరఫరా మాత్రమే లక్ష్యంగా పెట్టుకున్నారు. అది కూడా సాంకేతిక పరమైన లోపాల వల్ల తరుచూ ఫ్యాక్టరీలో క్రషింగ్ నిలిచిపోవడం వల్ల కాటాల నుంచి చెరకు సరఫరాకు అంతరాయం కలుగుతోంది. దీంతో రైతు పంట పొలం నుంచి కాటాకు తోలుకొచ్చిన చెరకు పది నుంచి పదిహేను రోజుల పాటు కాటాల వద్దే నిలిచిపోతోంది.

నిలిచిపోయిన చెరకు లారీలు

గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి, ఫ్యాక్టరీ పరిధిలో గల 22 కాటాల నుంచి 37 లారీల ద్వారా చెరకును తరలిస్తున్నారు. అయితే ఈ లారీలు కాంట్రాక్టుకు ఇవ్వవలసిన బకాయిలు ఫ్యాక్టరీ యాజమాన్యం చెల్లించకపోవడం వల్ల ఈ నెల 19వ తేదీ నుంచి లారీలు కాటాల నుంచి చెరకు తరలింపును నిలిపివేశాయి. దీనికి తోడు కాటాల వద్ద వెయింగ్ వేసే కళాసీలకు కూడా సంబంధిత కాంట్రాక్టరు వేతనాలు ఇవ్వకపోవడంతో వారు కూడా విధులు నిలిపివేశారు. టన్ను చెరకు బండి నుంచి లారీకి వెయింగ్ చేయడానికి రూ.143 ఇవ్వాల్సి ఉంది. అయితే క్రషింగ్ ప్రారంభం నుంచి నేటికీ ఒక్క రూపాయి కూడా వేతనం ఇవ్వలేదని కలాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే చెరకు రైతులకు కూడా ఇప్పటి వరకూ పాత బకాయిలు చెల్లించలేదు.

ట్రాక్టర్లతో చెరకు తరలింపు

చెరకు లారీలకు బకాయిలు చెల్లించక లారీలు నిలుపుదల చేయడంతో ట్రాక్టర్ల ద్వారా కాటాల నుంచి ఫ్యాక్టరీకి చెరకు తరలిస్తున్నారు. కె.జె.పురం చెరకు కాటా నుంచి టన్నుకు రూ.330 చొప్పున ట్రాక్టర్ల ద్వారా చెరకు తరలింపునకు రుసుం చెల్లించడం జరుగుతుందని ఫీల్డ్ సిబ్బంది పేర్కొన్నారు. మండలంలో ఘాట్‌రోడ్డు కాటా నుంచి ఈ విధంగానే చెరకును తరలిస్తున్నారు. ఒమ్మలి కాటా పరిధిలో చెరకు లేకపోవడంతో కాటాను ఇప్పటికే మూసివేశారు.

చెరకు రైతుల ధర్నా

చెరకు కాటాల నుంచి లారీల ద్వారా ఫ్యాక్టరీకి ఎప్పటికప్పుడు చెరకును తరలించాలని కోరుతూ సోమవారం కె.జె.పురం చెరకు కాటా వద్ద సభ్య రైతులు ధర్నా చేశారు. సకాలంలో చెల్లింపులు చేయాలని, రైతులను ఆదుకోవాలని నినాదాలు చేశారు.

చెరకు ఎండిపోతోంది



ఒక చెరకు బండి తూకం కావడానికి పదిహేను రోజులు సమయం పడుతుంది. పంట పొలం నుంచి చేసిన చెరకును కాటాకు తరలించాక కాటా యార్డులో చెరకు ఎండిపోతుంది. సుగర్ ఫ్యాక్టరీ నుంచి కాటాకు రెండు లారీలు మాత్రమే తిరుగుతున్నాయి. ఈ లారీలు కూడా సక్రమంగా తిరగడం లేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. చెరకు తూకం తగ్గి రస నాణ్యత తగ్గిపోతుంది.

– కర్రి సుబ్బారావు, రైతు, కె.జె.పురం, మాడుగుల మండలం.

కలాసీలకు వేతనాలు ఇవ్వలేదు



గోవాడ సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ ప్రారంభం నుంచి చెరకు కాటాల వద్ద పనిచేస్తున్న కలాసీలకు వేతనాలు ఇవ్వలేదు. ఒక టన్ను చెరకు వెయింగ్‌కు రూ.143 సంబంధిత లారీ కాంట్రాక్టరు ఇవ్వాల్సి ఉండగా, నేటికీ చెల్లింపులు చేయలేదు. నాకు సుమారు రూ.20వేలు వేతనంగా ఇవ్వాలి. కె.జె.పురం కాటా పరిధిలో 9 మంది కలాసీలు ఉన్నారు. వీరికి వేతనం ఇవ్వలేదు.

– పినిశెట్టి వెంకట్రావు, కళాసీ, కె.జె.పురం చెరకు కాటా

రైతులను నట్టేట ముంచింది



రాష్ట్రంలో లాభాల బాటలో నడిచే గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతులను పూర్తిగా నట్టేట ముంచింది. సభ్య రైతులు బకాయిలతో పాటు ఫీల్డ్ సిబ్బందికి, చెరకు కాటాల వద్ద పనిచేసే సిబ్బందికి ఏడాది నుంచి జీతాలు లేవు. సభ్య రైతులకు ఇవ్వాల్సిన బకాయిలు కూడా విడుదల చేయలేదు.

– పాలకుర్తి సత్యనారాయణ, సభ్య రైతు, కె.జె.పురం

షిర్డిసాయి మందిరానికి దాతల సహకారం



ఎం.కోడూరు షిర్డిసాయి మందిరానికి విరాళం అందజేస్తున్న దాతలు

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న షిర్డిసాయి మందిరం నిర్మాణానికి దాతలు విరాళాలు అందించారు. వీరనారాయణం గ్రామానికి చెందిన పందిరి రామకృష్ణ, దివ్యవాణి దంపతులు రూ.10వేలు నగదును విరాళంగా సోమవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడుకు అందజేశారు. కార్యక్రమంలో పోతిన జగదీష్ పాల్గొన్నారు.

నేడు వీరాంజనేయస్వామి తీర్థం

మాడుగుల రూరల్ : ఎం.కోటపాడు, వల్లాపురం గ్రామ ఆరాధ్య దైవం అయిన వీరాంజనేయ స్వామి తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మధ్యాహ్నం 3 గంటల నుంచి ఉత్తరాంధ్ర స్థాయి ఎడ్ల పరుగుల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. పోటీల్లో ప్రథమ బహుమతి రూ.15వేలు, ద్వితీయ రూ.12వేలు, తృతీయ రూ.10వేలు, అలాగే తరువాత స్థానాల్లో రూ.8వేల నుంచి రూ. వెయ్యి వరకూ నగదు బహుమతులు అందిస్తామన్నారు. అదే రోజు నిర్వహించే క్రికెట్ పోటీలకు కూడా ప్రథమ బహుమతి రూ.50వేలు, ద్వితీయ బహుమతి రూ.25వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు చొప్పున అందజేస్తామన్నారు. స్థానిక పీఏసీఎస్ వద్ద దాతల సహకారంతో అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బుచ్చెయ్యపేట : రాజాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 24 గంటలు విద్యుత్ సరఫరా పనులు దృష్ట్యా మంగళవారం ఉదయం 9 గంటలు నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ రాజు తెలిపారు. రాజాం సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాల ప్రజలు, రైతులు, ఉద్యోగులు, వ్యాపారులు విద్యుత్ అంతరాయానికి సహకరించాలన్నారు.

ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం మహాధర్నా



ధర్నా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

నర్సీపట్నం : ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో మహాధర్నా, దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ సీపీఎం ప్రజా చైతన్యయాత్రలో గుర్తించిన సమస్యలను ప్రభుత్వం దృష్టిలో పెట్టేందుకు మహాధర్నా చేపట్టామన్నారు. మున్సిపాలిటీ పేదలకు టిడ్కో గృహాలను పంపిణీ చేయాలని, ఏరియా ఆస్పత్రిలో శానిటేషన్ సిబ్బంది, స్టాఫ్ నర్స్‌లు, వైద్యులను నియమించాలని, ఫారెస్ట్, రెవెన్యూ పోడు భూములకు సాగు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గొలుగొండ మండలం, జోగంపేట గ్రామానికి చెందిన దళితులకు కోటవురట్ల మండలం, పందూరులో ఇచ్చిన సీలింగ్ భూములను దళితలకు అప్పగించి రక్షణ కల్పించాలన్నారు. బలిఘట్టం వాసులకు భూములు అప్పగించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం గొలుగొండ మండల కార్యదర్శి రాజుబాబు, సాపిరెడ్డి నారాయణమూర్తి, ఎల్.గౌరి, సూర్యప్రభ. జి.శివ, సత్తిబాబు, ప్రసన్న పాల్గొన్నారు.

పోషణలో మెలకువలపై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో శ్రీదేవి

మాడుగుల : అంగన్‌వాడీ చిన్నారులకు అందించే పోషణలో మెలకువలు నేర్పించడానికి 'పోషణ్ భీ..పఢాయీ భీ' శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మాడుగుల ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి సీహెచ్. శ్రీదేవి అన్నారు. సోమవారం మండలంలో ఎం. కోడూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రెండో విడత శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. శ్రవణ, దృశ్య పరికరాలను ఉపయోగించి 50 కేంద్రాలకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లకు మూడు రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తల్లి గర్భంలో ఉన్నప్పట నుంచి బిడ్డకు ప్రేరణ కలిగించే విధంగా తనను తాను రక్షించుకుంటూ ఆరోగ్య వాతావరణంలో బిడ్డకు జన్మనిచ్చే విధంగా తల్లులుకు అవగాహన కల్పించడంపై కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో శిక్షకులు పి.చిన్నమ్మలు, ఈశ్వరమ్మ, నారాయణమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది విశ్వనాథం, కార్తీక్ ,హెచ్ఎం పి.శ్రీనివాస్ 50 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి అప్పన్నపాలెం ఎంపిక



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏవో అప్పారావు

నర్సీపట్నం : ప్రకృతి వ్యవసాయం ద్వారా లాభాలను ఆర్జించవచ్చునని వ్యవసాయాధికారి అప్పారావు రైతులకు సూచించారు. సోమవారం అప్పన్నపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ గ్రామంగా ఎంపిక చేశామన్నారు. రైతులకు నవధాన్యాలు, పచ్చి రొట్ట విత్తనాలు, తొలకరి వర్గాలకు ముందు ఇవ్వాలని ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడి, నాణ్యమైన అధిక దిగుబడి సాధించేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం ఇంచార్జీ సాయి చంద్రిక, ఎంపీఈవో ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.



స్టాల్ వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లచ్చన్న

మాకవరపాలెం: ప్రకృతి సాగుతో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించవచ్చని ప్రకృతి సేద్య విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లచ్చన్న అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రకృతి సేద్యం ద్వారా సాగు చేసిన ఉత్పత్తులను విక్రయించేందుకు సోమవారం స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్టాల్‌ను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించడంతో పాటు ఆరోగ్యకరమైన పంటను పొందవచ్చని రైతులకు సూచించారు. అన్నిగ్రామాల్లో రైతులు ప్రకృతి సేద్యం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రకృతి సేద్య సిబ్బంది కవిత పాల్గొన్నారు.

ఖండివరంలో నాలుగు బోర్ల ఏర్పాటు



బోరు మిషన్ స్విచ్ ఆన్ చేస్తున్న దృశ్యం

చీడికాడ : ఖండివరంలో జిల్లా పరిషత్ నిధుల నుంచి నాలుగు తాగునీటి బోర్లు ఏర్పాటు చేసినట్లు సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం గ్రామంలో బోర్లు ఏర్పాటుకు మిషన్ స్విచ్ ఆన్ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మా గ్రామానికి 4 బోర్లు అందించినందుకు జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాంతో పాటు మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ భర్త కురచా నారాయణమూర్తి, కో–ఆప్షన్ మెంబర్ షేకు సూర్యనారాయణ, ఎంపీటీసీ గెంజి స్వాతి బాలాజీ, వైఎస్సార్‌సీపీ నేతలు సన్నిబాబు, కొండబాబు, సింగంపల్లి ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

ముందుగా గుర్తిస్తే క్షయ నివారణ సాధ్యం



వి.సంతపాలెంలో ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారి శైలజ



గొలుగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



దేవరాపల్లిలో క్షయ వ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారి వనజ, వైద్య సిబ్బంది.



రోలుగుంటలో వైద్య సిబ్బందితో కలసి ర్యాలీ చేస్తున్న వైద్యాధికారి ధనలక్ష్మి

కె.కోటపాడు : పది రోజుల కన్నా ఎక్కువగా దగ్గుతో కూడిన జ్వరం ఉంటే తప్పనిసరిగా క్షయ వ్యాధి నిర్ధారిత పరీక్షలు చేయించుకోవాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ సూచించారు. వి.సంతపాలెం గ్రామంలో సోమవారం వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీని జరిపారు. క్షయ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నివారణ సాధ్యమని తెలిపారు. ఆరు నెలల కాలం పాటు మందులను వాడితే వ్యాధి నయం అవుతుందన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ ప్రమీల, ఎంఎల్‌హెచ్‌పీ మంగ, ఏఎన్ఎం పద్మ పాల్గొన్నారు.

దేవరాపల్లి : క్షయ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డి.వనజ అన్నారు. స్థానిక వైద్య సిబ్బందితో కలిసి క్షయ వ్యాధి పట్ల అవగాహన ర్యాలీని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ మార్గాలను వివరించారు. క్షయ వ్యాధిని అంతం చేసేందుకు అందరూ సమిష్టిగా పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు. సీహెచ్‌వో ఆనంద్, పిహెచ్ఎన్ సునీత, హెచ్‌వీ లక్ష్మి,, హెల్త్ సూపర్‌వైజర్ పుష్పరాజ్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గొలుగొండ: క్షయవాధి పట్ల ఆందోళన వద్దని వ్యాధి నివారణకు మంచి మందులు ఉన్నాయని గొలుగొండ పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్యామ్, కీర్తి తెలిపారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా గొలుగొండలో ర్యాలీ నిర్వహించారు. వ్యాధులు సోకిన వారు ఆందళన చెందవద్దని తెలిపారు. వ్యాధి నివారణకు మందులు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోలుగుంట : క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ సిబ్బందితో కలసి వైద్యాధికారి ధనలక్ష్మి సోమవారం ర్యాలీ చేశారు. అనంతరం క్షయ వ్యాధి లక్షణాలు, జాగ్రత్తల గురించి వివరించారు.క్షయ వ్యాధి లక్షణాలున్న వ్యక్తి విధిగా చేతి రుమాలు వాడాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించి అవసరమైన సూచనలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో కృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ షాజహాన్ ఏఎన్ఎంలు, ఆశాలు సిబ్బంది పాల్గొన్నారు.

తైపురంలో ఆక్రమణలు తొలగించాలి



తైపురంలో ఆక్రమణ భూముల వద్ద బోర్డులు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

బుచ్చెయ్యపేట : తైపురం గ్రామంలో ఆక్రమణలకు గురౌవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని పలువురు కోరుతున్నారు. రాజాం, వెదుళ్లగెడ్డ, పెదమదీనకు వెళ్లే రహదారిలో సుమారు 12 ఎకరాలకు పైగా తైపురం రెవిన్యూకు చెందిన ప్రభుత్వ భూమి ఉంది. గెడ్డలు, వాగులను ఆనుకుని ఉన్న సర్వే నెంబర్ 168లో ఉన్న ప్రభుత్వ భూములను పలువురు ఆక్రమణలకు పాల్పడుతున్నారని పేద ప్రజల హక్కుల పోరాట సమితి కన్వీనర్ నాగేశ్వరరావు రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఈదురు గాలులతో వర్షం

మాడుగుల రూరల్ : వాతావరణంలో ఏర్పడిన మార్పులు, ఆవర్తన ప్రభావంతో ఆకాల వర్షం కురిసింది. సోమవారం మధ్యాహ్నం ఆకాశం మేఘావృతంగా మారి, ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షానికి అక్కడక్కడ మామిడి కాయలు పూర్తిగా రాలిపోయాయి.

విద్యార్థులు పెడదోవ పట్టకుండా చూడాలి

నాతవరం : మాదక ద్రవ్యాల నియంత్రణ, చిన్నారులు లైంగిక వేధింపులకు గురి కాకుండా కాపాడవలసిన బాధ్యత మనందరిపై ఉందని నాతవరం ఎస్ఐ సిహెచ్. భీమరాజు అన్నారు. మండల కేంద్రంలో గల హైస్కూల్‌లో సోమవారం పోలీసులు మొబైల్ వ్యానుపై పలు అంశాలను తెరపై చూపుతూ అవగాహన కల్పించారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సంఘటనలు, విద్యార్థులు పెడదోవ పడకుండా తల్లిదండ్రులు ఎలాంటి జాగ్రత్తలు చేపట్టాలన్న విషయాలపై దృశ్య మాలిక ద్వారా వివరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బందితో పాటు ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జీడి పిక్కలకు మద్దతు ధర కల్పించాలి



మాడుగుల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిరసన



కె.కోటపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

మాడుగుల : జీడిపిక్కలకు మద్దతు ధర కల్పించాలని, సీపీఎం మండల కార్యదర్శి ఇరటా నరసింహమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం జీడి రైతులు చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. కిలో జీడిపిక్కకు రూ.200 మద్దతు ధర కల్పించాలని, రైతు సేవా కేంద్రాల ద్వారా జీడిపంటను కొనుగోలు చేయాలని అన్నారు. ఇంత వరకు 80 కిలోలున్న జీడి బస్తాలకు రూ.7వేలుకు మించి ఇవ్వలేదన్నారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, జీడిబోర్డు ఏర్పాటు చేయాలని, 80 కిలోలున్న జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర కల్పించాలని, జీడిపంటకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు ఇప్పించాలని గిరిజనుల తరపున డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిన్నెపల్లి సన్యాసమ్మ, చెదల కృష్ణ, కిల్లో సత్తిబాబు, బచ్చల రాము, పందిల రాజబాబు, గొర్లి వినోద్ కుమార్ పాల్గొన్నారు.

కె.కోటపాడు : రైతుల వద్ద జీడిపిక్కలను ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు వివిధ సమస్యలపై సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు. రైతుల నుంచి కొనుగోలు చేసే జీడిపిక్కలు కిలోకు రూ.200 మద్దతు ధరను అందించాలని కోరారు. కె.కోటపాడులో గల పూసల, శ్రీకృష్ణాలయం, విశ్వబ్రాహ్మణ, ఎగువ యాతపేటలలో పారిశుద్యం, మంచినీటి సమస్యకు పరిష్కారాన్ని చూపాలని కూడా విజ్ఞప్తి చేశారు. పంచాయితీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో పాటు పన్నెండు వారాల ఉపాధి వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు, ఈర్లె నాయుడుబాబు, గాడి ప్రసాద్ పాల్గొన్నారు.

చెయ్యి విరిగినా పదో తరగతి పరీక్షకు హాజరైన విద్యార్థి



చెయ్యి విరగడంతో బాలిక సహకారంతో పరీక్ష రాసేందుకు హాజరైన టెన్త్ విద్యార్థి ఉపేంద్ర

దేవరాపల్లి: ప్రమాదవశాత్తూ జారిపడి కుడి చెయ్యి విరిగిపోవడంతో మరో విద్యార్థి సహకారంతో పదో తరగతి పరీక్షకు సోమవారం హాజరయ్యాడు. అనంతగిరి మండలం జీనబాడు పంచాయితీ శివారు పెదగంగవరం గ్రామానికి చెందిన పెనగంటి ఉపేంద్ర దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 21న పరీక్ష రాసి ఇంటికి వెళ్లగా ఇంటి గోడపై నుంచి ప్రమాదశాత్తూ జారి పడిపోవడంతో కుడి చేయి విరిగింది. వెంటనే కుటుంబీకులు ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించి, విరిగిన చేతికి సిమెంట్ కట్టు వేయించారు. సోమవారం పరీక్షలు రాయాల్సి ఉండడంతో ఈ విషయాన్ని తెనుగుపూడి గురుకుల విద్యాలయంలోని పరీక్ష కేంద్రంలోని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వేరొక విద్యార్థి సహకారంతో పరీక్ష రాయడానికి అధికారులు అనుమతివ్వడంతో కుడి చెయ్యి విరిగిన ఉపేంద్ర బాలిక సహకారంతో పరీక్ష రాశాడు.